ప్రజాశక్తి

విశాఖపట్నం అనకాపల్లి

శుక్రవారం 13 జూన్ 2025

12 పేజీలు



చంద్రశేఖర్ (ఫైల్)



కుమార్ (ఫైల్)

వార్త మెయిన్, టాబ్లాయిడ్ 6లో..



విషవాయువు లీకైన ప్రదేశం ఇదే..

ఎస్ఎస్ ఫార్మాలో విష వాయువు లీక్

- ఇద్దరు మృతి, ఒకరి పరిస్థితి విషమం
- ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం, సిఐటియు

బడి గంట మోగింది

వార్త 12లో..

సిఎం విశాఖ పర్యటన రద్దు

వార్త 6లో..

బాల కార్మికులు లేని సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మించడమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని శాశ్వత లోక్ అదాలత్ న్యాయమూర్తి, రిటైర్డ్ ప్రిన్సిపల్ జడ్జి జి.వల్లభ నాయుడు అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కార్మిక శాఖ, జిల్లా విద్యాశాఖ, యాక్సిస్టివ్ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ అప్ హోల్డ్ సంస్థ సంయుక్తంగా గురువారం విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలలు బాల కార్మికులుగా మారడానికి తల్లిదండ్రులు కూడా కారణమవుతున్నారని, వారి ఆర్థిక స్థితిగతులు బాగాలేక పిల్లలపై ఆధారపడుతున్నారని తెలిపారు.

నిరక్షరాస్యత, అభివృద్ధి, పథకాలపై అవగాహన లేకపోవడం, వలస వెళ్లడం, ఇంటి పనులకు పెట్టడం, ఆర్థిక మాంద్యం తదితర కారణాలవల్ల బాలలు బాల కార్మికులుగా మారుతున్నారని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీత మాట్లాడుతూ బాల కార్మికులను రెస్క్యూ చేయటంలో తమ సంస్థ, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు అందరూ కలిసి కృషి చేస్తున్నామని, గుర్తించిన వారిని తిరిగి రిహాబ్లేట్ చేయడం కోసం బాలల సంక్షేమ సమితి, ఇతర శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయని అన్నారు. బాలబాలికలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలా పనిలో పెట్టుకున్న సంస్థలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలలకు తగు నష్టపరిహారం అందజేస్తున్నామన్నారు. మండల విద్యాశాఖ అధికారి పుష్యరాగం మాట్లాడుతూ చదువుకోవలసిన వయసులో 18 ఏళ్ల వరకూ నిర్బంధ విద్య అవకాశం ఉందని, పిల్లలు చక్కగా చదువుకునే అవకాశం ఉన్నప్పటికీ పనిలోకి వెళ్ళటం విచారకరమని అన్నారు. యాక్సిస్ టు జస్టిస్ అప్ హోల్డ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ జి.డేవిడ్ రాజు మాట్లాడుతూ తమ సంస్థ గత సంవత్సరం లేబర్ డిపార్టుమెంట్‌తో, మిగిలిన సంస్థలతో కలిసి 2012 మందిని రెస్క్యూ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ అధికారులు, డిసిపిఒ మమత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వల్లభ నాయుడు



అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



ప్రజాశక్తి- సబ్బవరం : అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్లులాంటివని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఏడాదిపాలన పూర్తయినా సందర్భంగా, శుక్రవారం తన పుట్టిన రోజును పురస్కరించుకొని నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలపై ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత సంవత్సర కాలంలో పెందుర్తి నియోజకవర్గంలో రూ.229 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జివిఎంసి ద్వారా రూ.117.79 కోట్లతో 423 పనులు చేపట్టి, రూ.71.46 కోట్ల విలువైన 243 పనులను పూర్తిచేశామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.26.85 కోట్లతో 391 పనులు చేపట్టి, రూ.12.62 కోట్లు విలువైన 280 పనులు పూర్తి చేశారన్నారు. ఇతర శాఖలు, విభాగాల ద్వారా రూ.14.23 కోట్లతో 111 పనులను చేపట్టామన్నారు.

అలాగే ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ ద్వారా రూ.12.25 కోట్లతో 142 పనులు చేపట్టి రూ.1.79 కోట్లు ఖర్చు చేసి 103 పనులు పూర్తి చేశామని, మిగిలిన 39 పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ.78 కోట్లతో 25 పనులు చేపట్టి, రూ.8.65 కోట్లు ఖర్చు చేసి 23 పనులు పూర్తి చేశామన్నారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.9.36 కోట్లతో 510 పనులు చేపట్టి 5.37 కోట్లు ఖర్చు చేసి 394 పనులు పూర్తి చేశామన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రూ.కోటితో 16 పనులు పూర్తి చేశామన్నారు. సిఎస్ఆర్ గ్రాంట్ ద్వారా రూ.2.40 కోట్లు ఖర్చు చేసి 22 పనులు పూర్తి చేసామన్నారు. మినీ గోకులం పథకంలో రూ.1.29 కోట్లతో 65 గోకులం షెడ్ లు మంజూరు కాగా 0.71 కోట్లు ఖర్చు చేసి 55 నిర్మాణాలు పూర్తి చేశామన్నారు.

మాస్టర్ ప్లాన్‌లో 7 రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. వేపగుంట నుంచి జత్తాడ వైపు గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులో 80 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టామని, ప్రస్తుతం ఆ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మాస్టర్ ప్లాన్‌లో నాయుడు తోట నుండి పొర్లుపాలెం వరకు 100 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు.

గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో రూ.47.95 కోట్ల అంచనాతో 2665 ఇల్లు మంజూరు కాగా, రూ. 2.73 కోట్లు ఖర్చు చేసి 480 ఇళ్ల పూర్తిచేశామన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రూ.15లక్షల విత్తన సబ్సిడీని రైతులకు అందజేశామ్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు రూ.44లక్షల రాయితీ అందజేశామన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లు మొత్తాన్ని లబ్ధిదారులకు రూ.నాలుగు వేలు చొప్పున ప్రతినెలా అందజేస్తున్నామన్నారు. జూన్ నెలలో కొత్తగా 369 మందికి స్పౌజ్ పెన్షన్స్ మంజూరయ్యాయన్నారు. ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గంలో మెగా జాబ్‌మేళాలను నిర్వహించి, 44 ప్రముఖ కంపెనీలతో 3020 మందికిగాను, 826 మందికి ఉద్యోగావకాశాలను కల్పించామన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 28 మందికి వైద్యసాయం కింద రూ. 72.78 లక్షల ఆర్థికలబ్ధి అందజేశామన్నారు.





జలజీవన్ మిషన్ పనులతో రోడ్లు శిథిలం



శిథిలమైన రహదారులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలో జలజీవన్ మిషన్ కార్యక్రమం కింద ప్రతి ఇంటికీ పైపులైన్ వేసేందుకు చేపట్టిన పనులు గ్రామస్తులకు తీవ్ర అసౌకర్యాలు కలిగిస్తున్నాయి. మూడు నెలల క్రితమే పైపులైన్లు వేసేందుకు గోతులు తీసి ఇప్పటికీ పూడ్చకపోవడంతో రోడ్లు శిథిలమై ప్రమాదాలకు నిలయంగా మారాయి. గంభీరం అంబేద్కర్ విగ్రహం నుంచి కమ్యూనిటీ హాల్ వరకు, బోయపాలెం రంపాడ సూర్యప్రకాశ్ ఇంటి నుంచి రామాలయం, ముప్పలవారి వీధి, వెంపాడవారి వీధి, తెడ్లపు వారి వీధి వరకు తవ్విన రోడ్లు పూడ్చకపోవడం వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర రాళ్లు వాహనాలు అదుపుతప్పేలా చేస్తున్నాయి. ఇటీవల అల్లంపల్లి శ్రీను (35) ప్రమాదానికి గురై చేతి ఎముక విరిగింది. టూవీలర్లు తరచూ అదుపుతప్పుతున్నాయి. మాదాబత్తుల సూరిబాబు కారుకు ఇటీవల ప్రమాదానికి గురై మరమ్మతుకు గురైంది. చిన్నపాటి వర్షం పడినా వీధుల్లోని బురద ఇళ్లలోకి చేరుతోందని మామిడి గీత ఆవేదన వ్యక్తం చేశారు.

దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్ఎస్ఆర్.మూర్తిని వివరణ కోరగా 'జల జీవన్ మిషన్ పనులు ఇంకా నెల రోజులలో పూర్తవుతాయి. అనంతరం పూర్తిస్థాయిలో రోడ్ల మరమ్మతులు చేపడతాం' అని తెలిపారు. కొన్ని చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభించామని, మిగిలిన ప్రాంతాల్లో త్వరలో పైపులు అమర్చి రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామని గ్రామ కార్యదర్శి చలపతిరావు వివరణ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

పోలీస్ కస్టడీలో మీసాల అప్పలనాయుడు విచారణ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం గ్రామానికి చెందిన మీసాల అప్పలనాయుడును పోలీస్ కస్టడీలో విచారణ చేపట్టారు. గత నెల 31వ తేదీన ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. గురువారం ఆయనను పోలీస్ కస్టడీలోకి తీసుకుని ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఎసిపి అప్పలరాజు ఆధ్వర్యాన విచారణ చేపట్టారు. అప్పలనాయుడు భూమి ఇస్తానని రూ.97 లక్షలు తీసుకొని మోసం చేశాడని, గత నాలుగు సంవత్సరాలుగా ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వకుండా మానసికంగా హింసిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని విశాఖపట్నం రామటాకీస్ ప్రాంతానికి చెందిన దళిత మహిళ కుంచంగి లక్ష్మి చేసిన ఫిర్యాదుతో అప్పలనాయుడు, ఆయన భార్య శ్రీదేవిని పోలీసులు అరెస్టుచేశారు. విచారణలో లక్ష్మి వద్ద నుంచి రూ. 97 లక్షలు తీసుకున్నట్లు అప్పలనాయుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. మరికొన్ని ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు కూడా దర్యాప్తులో బయటపడ్డాయని పేర్కొన్నారు. లాయర్ సమక్షంలో జరిపిన విచారణ అనంతరం అప్పలనాయుడును కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఇంకా కొన్ని కీలక అంశాలపై దర్యాప్తు అవసరముండడంతో, ఒక్క రోజు పోలీస్ కస్టడీ కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మీసాల అప్పలనాయుడుపై రౌడీషీటర్‌గా కూడా కేసులు ఉండటంతో మరింత లోతైన విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

ఖరీఫ్ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వివిధ రకాల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ గురువారం తెలిపారు. ఎకరానికి 30 కిలోలు చొప్పున వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ లెక్కన 2,960 క్వింటాళ్ల కు గాను 1909 క్వింటాళ్లు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. కిలో రూ.5 రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి విత్తన ప్యాకెట్ (30 కిలోలు)తో పాటు 250 గ్రాముల సూడో మోనాస్ విత్తన శుద్ధి మందును 50 శాతం రాయితీపై రూ.38కి పంపిణీ చేయనున్నామని తెలిపారు.

వరి పంట సాధారణ విస్తీర్ణం ఇలా...

భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెదగంట్యాడ మండలాల్లో వరి పంట సాధారణ విస్తీర్ణం ఇలా ఉంది. భీమిలి మండలంలో 1298 ఎకరాలు, ఆనందపురంలో 1548, పద్మనాభంలో 7015, పెదగంట్యాడలో 7.5 ఎకరాలున్నట్లు వివరించారు.

ఎన్ఎంఎంఎస్‌కు 24 మంది ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు 24 మంది 8వ తరగతి విద్యార్థులు ఎంపికైనట్లు ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు గంటాన మోహనరావు, అధ్యక్షులు దత్తి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన 6 నెలల పాటు ఇచ్చిన ఉచిత శిక్షణ పొందారని తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన వీరు 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం పొందనున్నట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఉచిత శిక్షణ అందించిన ఉపాధ్యాయుల్లో వైవి.రమణ (బయాలజీ), ఎల్ఎ.శ్రీనివాస్, దయాసాగర్, చిన్నయ్య (మేథ్స్), దత్తి రవి, ఆనంద్ (సోషల్), శివకుమార్, నాగేశ్వరరావు, సూర్యారావు (ఫిజిక్స్) ఉన్నారని తెలిపారు.

ఉపాధ్యాయ నియామక పరీక్షకు 92.65 శాతం హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో గురువారం జరిగిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8, మధ్యాహ్నం 5 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 3,975 అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 3,683 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 92.65 శాతం హాజరైనట్టు వివరించారు.



కూనకు జన్మనిచ్చిన మూషిక జింక

జూ పార్కులో కూనలకు జననం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలలో సంరక్షణ, పునరుత్పత్తి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. తాజాగా ఒక రెడ్ నెక్డ వాల్ బి, ఒక మౌస్ డియర్ (మూషిక జింక)కు కూనలు జన్మించాయి. ఈ అందమైన కొత్త సభ్యులు జాగ్రత్తగా పెరుగుతున్నాయనిజూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. త్వరలో వాటిని సందర్శకుల కోసం ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు.

భీమిలి ఎంపిడిఓగా నరసింహారావు



ప్రజాశక్తి -భీమునిపట్నం

స్థానిక ఎంపిడిఓగా కెవి.నరసింహారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇతను అనకాపల్లి నుంచి ఇక్కడకు వచ్చారు. కొంత కాలంగా ఇక్కడ ఎంపిడిఓగా పనిచేసిన ఎన్ హనుమంతరావు చింతపల్లి బదిలీ అయ్యారు.



ఆనందపురం మండల ఆర్ఐగా అవినాష్

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా అవినాష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి విభాగంలో ఆయన విధులు నిర్వర్తించారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అవినాష్‌కు మండల డిప్యూటీ తహసీల్దార్ చేతన్ కుమార్, విఆర్ఒలు, ఇతర రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు చేరువగా ఉండి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అవినాష్ చెప్పారు. ఇప్పటివరకు ఆనందపురం మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రీటా భీమిలి ఆర్‌డిఒ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు.

రేషన్ డిపోలు బహుదూరం

ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కార్డుదారులకు ఈ నెల 1 నుంచి డిపోల్లో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. 12వ వార్డు పరిధిలో కాలనీ వాసులకు రేషన్ డిపోలు అందనంత దూరంలో ఉన్నాయి. దీంతో కార్డుదారులు రేషన్ డిపోలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు ఇంటి వద్దకు కాకపోయినా తాము ఉండే వీధి చివరికైనా వచ్చే రేషన్ వాహనం దగ్గరకు వెళ్లి తీసుకునే వారమని, ఇప్పుడు కొన్ని కాలనీల వాసులు సుమారు 1 నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనికి కారణం ఒకే వార్డులో 9 రేషన్ డిపోలు కేంద్రీకృతమై ఉన్నాయి. ప్రతి వార్డుకూ సుమారు 5 రేషన్ డిపోలు ఉండాలి. కానీ 12 వార్డులో 4 రేషన్ డిపోలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా వార్డులో ఉన్న కాలనీ వాసులకు దూరంగా ఉన్నాయి. దీంతో అక్కడకు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకుందని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

12వ వార్డులో ఉండాల్సిన 221 రేషన్ డిపో 11వ వార్డులో ఉంది. దీనిలో సుమారు 770 కార్డుదారులు ఉన్నారు. వారందరూ 12వ వార్డులో ఉన్న లబ్ధిదారులే. చాలా మంది లబ్ధిదారులు వెళ్లలేకపోవడంతో అక్కడ డిపోలో సరుకులు మిగిలి పోయే పరిస్థితి ఏర్పడుతుంది. శ్రీలీలాసుందరయ్యనగర్, నెహ్రూనగర్, దుర్గానగర్, లక్ష్మీనగర్, కనకదుర్గానగర్, రాజేంద్రనగర్, న్యూ అంబేద్కర్ నగర్, ప్రజాశాంతినగర్ వాసులకు రేషన్ డిపోలకు చేరుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వే చేసి రేషన్ డిపోలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



ప్రజాశక్తి క్రీడాకారులతో సిపి శంఖబ్రత బాగ్చి

ఉత్సాహంగా జెపిఎల్

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు పోర్టు స్టేడియంలో నాలుగు రోజులుగా ఉత్సాహంగా సాగుతున్నాయి. అల్లూరి జిల్లా బి, ప్రజాశక్తి, మీడియా వెబ్ వారియర్స్, గాజువాక మీడియా జట్ల మధ్య సెమీ ఫైనల్స్ జరిగాయి. ఈ సందర్భంగా పోర్టు స్టేడియంలో మీడియా జట్లను విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిచయం చేసుకున్నారు. జర్నలిస్టులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా వృత్తిలో మరింత ఉత్సాహంగా సేవలు అందించగలరని సిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి రావులవలస రామచంద్రరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హరనాథ్, ఎపియు డబ్ల్యుజె ప్రతినిధులు, జెపిఎల్ నిర్వాహకులు రవి, చందుయాదవ్, భరత్, విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీ విశ్వనాథ్, గోల్డెన్ ఫీచర్స్ అధినేత శ్రీనివాస్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రికి స్కానింగ్ మిషను అందిస్తున్న హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు

ఇఎస్ఐ ఆసుపత్రికి స్కానింగ్ మిషన్ వితరణ

ప్రజాశక్తి -ములగాడ : సింధియా గాంధీగ్రామ్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రికి హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ సౌజన్యంతో స్కానింగ్ మిషన్‌ను సంస్థ కమాండర్ హేమంత్ ఖత్రి, వారి సతీమణి వందన ఖత్రి గురువారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణమూర్తి మాట్లాడుతూ, ఈఎస్ఐ ఆసుపత్రిలో మెరుగైన సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈఎస్ఐ హాస్పిటల్‌లో గతంలో హెచ్‌ఎస్ఎల్ ప్రతినిధులు పర్యటించినప్పుడు స్కానింగ్ మిషన్ లేదని వారికి తెలపడంతో రూ.13.50 లక్షలు సిఎస్ఆర్ నిధులతో స్కానింగ్ మిషను వితరణగా ఇచ్చారని తెలిపారు. హెచ్‌ఎస్ఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒమేగా కేన్సర్ వైద్య నిపుణులు మహిళలకు గర్భసంచి కేన్సర్ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అనంతరం సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.14 లక్షలతో సుమారు 400 ఇంజక్షన్లను వితరణ చేశారు. ఆసుపత్రిలో కేన్సర్‌పై అవగాహన సదస్సును మహిళలకు ఏర్పాటుచేశారు. గురువారం సుమారుగా 250 మంది మహిళలు ఈ ఇంజక్షను సద్వినియోగంపరచుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రాకేష్‌ప్రసాద్, సిఎస్ఆర్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌రెడ్డి, ఈఎస్ఐ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కరణం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జనసేన నాయకులు కరణం కనకారావు జన్మదిన వేడుకలు గురువారం గాజువాక ఆటోనగర్‌లో జరిపారు. డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.రమణ, ప్రసాద్, గిరి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కనకారావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి

ఎట్టకేలకు రైతుబజార్ నిర్మాణం పూర్తి

ఎప్పటికి ప్రారంభమయ్యేనో?



ఆరిలోవ తోటగరువులో నిర్మాణం పూర్తి చేసుకున్న రైతుబజార్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎన్నో ఏళ్లుగా ఆరిలోవ ప్రజలు ఎదురు చూస్తున్న రైతుబజార్ నిర్మాణం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ప్రారంభానికి మాత్రం ఊగిసలాట ఆడుతోంది. రైతుబజార్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. 10వ వార్డు పరిధి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకొని ఉన్న సుమారు 40 సెంట్లు స్థలంలో 43 స్టాల్స్, ఒక కార్యాలయం, టాయిలెట్లు, రైతులు వేచి ఉండే గది, ఆర్ఒ ప్లాంట్‌తో అత్యాధునికంగా నిర్మించేందుకు 2022 ఆగస్టులో శంకుస్థాపన చేశారు. మొదటిలో నిర్మాణ పనులు వేగవంతంగా జరిగినా తరువాత నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. మళ్లీ తిరిగి నిర్మాణ పనులు వేగవంతం కావడంతో ఎట్టకేలకు పూర్తి స్థాయిలో నిర్మాణాలను పూర్తి చేశారు. ఇంకా ప్రధాన రహదారి నుంచి రైతుబజార్‌లోకి రావడానికి సిసి రోడ్డు వేయాల్సి ఉంది. రైతుబజార్ నిర్మాణం అంతా సిద్ధంగా ఉన్నా ఇంకా ప్రారంభానికి ఇంకా ఏమేమి అడ్డంకులు ఉన్నాయో అని స్థానికులు ఆరా తీస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న ఆరిలోవ ప్రజలకు తొందరగా రైతుబజార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ధన్యజీవి రామునాయుడు

వర్ధంతి సభలో వక్తలు



రామునాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పిస్తున్న లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన ధర్మరెడ్డి రామునాయుడు 4వ వర్ధంతి సభ నిర్వహించారు. రామునాయుడు చిత్రపటానికి సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, రామునాయుడు, తాను డివైఎఫ్ఐ, సిఐటియు, సిపిఎం మల్కాపురం జోన్ కమిటీలో కలిసి పనిచేశామన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు పూర్తయ్యేవరకూ నిద్రపోయేవాడు కాదని తెలిపారు. ఐఒసిలో విధులు నిర్వహిస్తూనే సిఐటియు, సిపిఎంలో పనిచేశారని తెలిపారు. దుర్గానగర్ సిపిఎం ప్రెసిడెంట్‌గా, సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ నాయకుడుగా నిరంతరం ప్రజల సమస్యలపై పనిచేశారని గుర్తుచేశారు. 15 ఏళ్లపాటు దుర్గా నగర్ ప్రెసిడెంట్‌గా పనిచేసి ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని కొనియాడారు. అటువంటి నిబద్ధత కలిగిన నాయకుడు లేకపోవడం సిపిఎంకే కాదు ప్రజలకు కూడా తీవ్ర నష్టమని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనలో మనమందరం నడిచినప్పుడు అతనికి ఘనమైన నివాళి అన్నారు. ఈ వర్ధంతి సభలో దున్న రాజేష్, జె.రామునాయుడు, శంకరరావు, సురేష్, దుర్గారావు, ఈశ్వరరావు, రామకృష్ణ, ఆదినారాయణ, కుమార్ తదితరులు పాల్గొని రామనాయుడుకు నివాళులర్పించారు.

63వ వార్డు పరిధి చింతలలోవలో కె.పెంటారావు, రాము పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజు, ఈశ్వరరావు, సత్తిబాబు, నీలయ్య పాల్గొన్నారు. జివిఎంసి 59, 60 వార్డుల ఆఫీసు వద్ద రామునాయుడు చిత్రపటానికి ఎన్.గంగులు, కె.రమణ, బి.రాంబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి.రాముకుమార్, జె.రామారావు, డి.రాజులక్ష్మి, రాజేశ్వరి, పాప, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



సాల్మన్ బెన్నీని సన్మానిస్తున్నచల్లా రామకృష్ణ

ఎయు బ్రాండింగ్ మీడియా అసోసియేట్ డీన్‌గా సాల్మన్ బెన్నీ

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీ అవుట్‌రీచ్ బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్‌గా నియమితులైన ఆంగ్ల విభాగం ఆచార్యులు డాక్టర్ ఎన్.సాల్మన్ బెన్నీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ అండ్ మీడియా రిలేషన్స్ డైరెక్టర్, జర్నలిజం ఆచార్యులు చల్లా రామకృష్ణ ఆచార్య బెన్నీకి బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఆచార్య రామకృష్ణ మాట్లాడుతూ ఆచార్య బెన్నీ ఆధ్వర్యాన విశ్వవిద్యాలయం బ్రాండింగ్ నూతన ఒరవడి సాధిస్తుందన్నారు. అనంతరం ఆచార్య బెన్నీని ఆచార్య రామకృష్ణ దుశ్శాలువతో సత్కరించారు.

వయసుతో సంబంధం లేకుండా 'సుగర్'

డాక్టర్ శ్రావణి తాన్న

ప్రజాశక్తి -గాజువాక : మధుమేహ వ్యాధి ఇప్పుడు సర్వసాధారణం అయిపోయిందని, వయసుతో సంబంధం లేకుండా ప్రబలుతోందని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ శ్రావణి తాన్న తెలిపారు. ఈ వ్యాధిని కంట్రోల్ చేయడానికి వాడే ఇన్సులిన్ ఇంజక్షన్‌పై చాలా మందికి అపోహలు ఉన్నాయని పేర్కొన్నారు. డయాబెటిస్ అవగాహన వారం సందర్భంగా ఇన్సులిన్ గురించి ఆమె వివరించారు. ఇన్సులిన్ శరీరంలో ఉండే పాంక్రియాస్ గ్రంథి నుంచి విడుదలయ్యే హార్మోన్ అని, ఇది శరీరంలో గ్లూకోజ్ లెవల్స్ (చక్కెర స్థాయిలు) సరైన స్థితిలో ఉంచుతుందని పేర్కొన్నారు. ఇన్సులిన్ హార్మోన్ చాలా తక్కువగా ఉత్పత్తి అయినప్పుడు టైప్ 1 డయాబెటిస్ వస్తుందని తెలిపారు. ఇది సాధారణంగా చిన్నపిల్లలలో కనిపించినప్పటికీ ఏ వయసు వారికైనా రావచ్చని వివరించారు. వీరికి ఇన్సులిన్ చికిత్స తప్పనిసరి అని తెలిపారు. గర్భిణులలో వచ్చే డయాబెటిస్ చికిత్సలో కూడా ఇన్సులిన్ ప్రధానమైనదని వివరించారు. ఎక్కువ మంది డయాబెటిస్ వ్యాధిగ్రస్తుల్లో కనిపించే టైప్ 2 డయాబెటిస్‌లో కొన్ని సందర్భాల్లో చికిత్సకు ఇన్సులిన్ తప్పనిసరి అని తెలిపారు. ఇన్సులిన్‌పై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇన్సులిన్ ఇంజెక్షన్ రూపంలో లభిస్తోందని, ఒకసారి ఓపెన్ చేసిన ఇన్సులిన్‌ను సాధారణంగా నెల రోజుల వ్యవధిలోపు వాడాలని తెలిపారు. ప్రయాణంలో ఇన్సులిన్ తీసుకెళ్లాల్సి వచ్చినప్పుడు థర్మోకూల్ ప్యాక్‌లో పెట్టాలని సూచించారు. 25 డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువగా ఉష్ణోగ్రత ఉన్నప్పుడు ఇన్సులిన్ సామర్థ్యం తగ్గుతుందని పేర్కొన్నారు. ఇన్సులిన్ ఇంజెక్షన్ వయాల్, ఫ్లెలెక్స్ పెన్, పెన్ ఫిల్ రూపంలో లభిస్తోందని వివరించారు. పెన్ ఫిల్‌ను దానికి తగిన ఇన్సులిన్ పెన్‌లో మాత్రమే వాడాలని, వయాల్‌కు వాడే ఇన్సులిన్ సిరంజితోతో పెన్ ఫిల్ వాడకూడదని తెలిపారు. ఇన్సులిన్ సూచించిన మోతాదుకు మించి తీసుకున్నా, ఇన్సులిన్ వేసుకొని సమయానికి ఆహారం తీసుకోకున్నా సుగర్ (చక్కెర) స్థాయిలు బాగా తగ్గిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సుగర్ తగ్గినప్పుడు ఎక్కువగా చెమటలు పట్టడం, చేతులు వణకడం, ఆకలి ఎక్కువగా ఉండటం, గుండె దడ, ఆందోళన తదితర లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇన్సులిన్‌ను సరైన పద్ధతిలో, సూచించిన మోతాదులో తీసుకుంటూ, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ సుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడం వలన దీర్ఘ కాలిక సమస్యలు నివారించవచ్చని తెలిపారు.





రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీరు

ఆర్ అండ్ బి రోడ్లపై వర్షపు నీరు నిల్వ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని పలు చోట్ల ఆర్ అండ్ బి రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండిపోతుంది. మండలంలోని కింతాడ శివారు జోగన్నపాలెం, రామచంద్రపురం గ్రామాల వద్ద, కింతాడ నుండి గొల్లలపాలెం మార్గంలో బీసీ కాలనీ వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోయి వాహనదారులకు, బాటసారిలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. కొద్దిపాటి వర్షం కురిసినా రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉండిపోతుంది. అలాగే మండలంలోని పోతనవలస దాటిన తరువాత కృష్ణారాయుడు పేట జంక్షన్ వద్ద రోడ్డుపై పెద్ద గుంతపడింది. తక్షణమే గుంతలు పూడ్చి వర్షపు నీరు నిల్వ లేకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

పూర్తికాని మరుగుదొడ్లు

అయోమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రస్తుతం పనులు చేపట్టిన దృశ్యం

ప్రజాశక్తి-ఆనందపురం : వేసవి సెలవుల ముందు ప్రారంభమైన మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సుమారు 1000 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలకు సంబంధించి వేసవి సెలవుల సమయంలో పాత మరుగుదొడ్లను కూల్చి కొత్తవి నిర్మించేందుకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికీ, అనారోగ్య కారణాల వల్ల పనులు మధ్యలో నిలిచిపోయాయి. పాఠశాలలు గురువారం నుంచి తిరిగి ప్రారంభమైనా, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. దీనిపై కాంట్రాక్టర్ కోరుకొండ అప్పలరాజును వివరణ కోరగా "ఆరోగ్య సమస్యల వల్ల ఆలస్యం జరిగింది. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం" అని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు వివరించారు.

గొట్టిపల్లి హైస్కూల్‌లో ఆర్ఒ ప్లాంట్‌కు మరమ్మత్తులు

ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 269 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు శుద్ధమైన మంచినీటిని అందించేందుకు దివీస్ లేబొరేటరీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ కలిసి ఆర్ఒ ప్లాంట్‌ను పాఠశాలలో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఆ ప్లాంట్ మరమ్మత్తులకు గురైన కారణంగా నీటి సరఫరా నిలిచిపోయింది. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి సమస్య ముందుకొచ్చింది. సంబంధిత అధికారులు స్పందించి ఆర్ఒ ప్లాంట్‌కు తక్షణమే మరమ్మత్తులను పూర్తి చేసి తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలుచేయాలి

ప్రజాశక్తి- తగరపువలస : ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్టి వలస జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం ఎపి ఆశా వర్కర్ల సంఘం (సిఐటియు) జోన్ మహా సభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు ఎస్.అప్పలనాయుడు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకులు సీతారత్నం తదితరులు పాల్గొన్నారు. యుపిహెచ్‌సిల వారీగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

భవన నిర్మాణ కార్మికుల మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడలో జరిగే భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మిథిలాపురి వుడా కాలనీలో భవన నిర్మాణ కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు పేడాడ రాజశేఖర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు భద్రతా లేక ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు క్షతగాత్రులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలలో నిర్మాణ కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించుకుని, పోరాటాలకు సన్నద్ధం అవుతామని తెలిపారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్మాణ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. నిర్మాణాలలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. మహాసభలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని, భవిష్యత్తు ఉద్యమాలకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, బార్ల సూర్యనారాయణ, బి.బంగారయ్య, పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

- మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలి

- సిపిఎం, సిఐటియు డిమాండ్ - భద్రతా ప్రమాణాల వైఫల్యం వల్లే ఘటన

ప్రజాశక్తి - అనకాపల్లి

పరవాడ ఫార్మాసిటీలో సాయి శ్రేయాస్ (ఎస్-ఎస్) ఫార్మా కంపెనీలో విషవాయువులు లీకై ఇద్దరు మృతిచెందిన ఘటనపై సిపిఎం, సిఐటియు జిల్లా కమిటీలు వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. ఈ విష వాయువుల లీకేజీ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్.శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే పరిశ్రమలో గతంలో కూడా ప్రమాదం జరిగిందని, భద్రతా ప్రమాణాల వైఫల్యం వల్లే తాజాగా ఈ ప్రమాదం జరిగి ఇద్దరు మృత్యువాత పడ్డారని, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న కార్మికునికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. తరుచూ ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడం దారుణమన్నారు. ఫార్మా యాజమాన్యాలు లాభాలు తప్ప భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. సోషల్ ఆడిట్ జరిపి భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై ప్రభుత్వాలు, అధికారులు చర్య తీసుకోవడంలో ఘోరంగా విఫలమవుతున్నారన్నారు. గతంలో అసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17 మంది చనిపోయినా నేటికీ ఆ యాజమాన్యంపై చర్యలు లేవన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తరచూ ప్రమాదాలతో కార్మికుల్లో మరింత భయాందోళన నెలకొందని, వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



ఘటన వివరాలను తెలియజేస్తున్న గనిశెట్టి

సిఎం విశాఖ పర్యటన రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖలో సిఎం చంద్రబాబు పర్యటన రద్దయింది. ఈ మేరకు గురువారం రాత్రి ఓ ప్రకటన విడుదలైంది. వాస్తవానికి శుక్రవారం ఉదయం విశాఖలో నిర్వహించనున్న న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ రీజనల్ వర్క్ షాప్‌లో చంద్రబాబు పాల్గొనాల్సి ఉంది. అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో విశాఖ కార్యక్రమం రద్దయింది. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం కూడా రద్దయినట్టు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు.



వస్తువులు అందజేస్తున్న శివకుమార్

అల్లూరి విజ్ఞాన కేంద్రానికి వస్తువుల వితరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో గుర్తింపు పొందిన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రానికి నిత్యం ఉపయోగపడే కొన్ని వస్తువులను జిల్లా పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి రిటైర్ అయిన శివకుమార్ గురువారం అందజేశారు. విజ్ఞాన కేంద్రం అవసరాల నిమిత్తం బకెట్లు, డస్ట్ బిన్లు, స్టూల్స్ తదితర ప్లాస్టిక్ సామగ్రి విరాళంగా ఇచ్చారు. వారికి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం తరుపున కోశాధికారి విఎస్.పద్మనాభరాజు, ఎంఆర్‌డి.రాజు, జిఎస్.రాజేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

ఇంటి వద్దకే రేషన్ కొనసాగించాలి

- మానవ హక్కుల వేదిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో భాగంగా ఇంటి వద్ద రేషన్ సరఫరా విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల రద్దు చేయడం పట్ల మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) ఎపి కార్యదర్శి వై. రాజేష్, ఎపి, తెలంగాణ రాష్ట్రాల ప్రతినిధి వి.ఎస్ కృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. ఈ చర్య వల్ల మారుమూల గ్రామాల్లో నివసించే ఆదివాసుల ఆహార భద్రతకు తీవ్రమైన విఘాతం కలుగుతుందన్నారు. 2021లో ప్రారంభమైన ఇంటివద్ద సరఫరా విధానం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్‌ల ద్వారా రేషన్‌ను నేరుగా లబ్ధిదారుల వద్దకు చేరేవన్నారు. ఇది వృద్ధులు, వికలాంగులు రోజువారీ కూలీల ప్రయాణభారాన్ని గణనీయంగా తగ్గించింద న్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో, ముఖ్యంగా నల్లమల అరణ్యంలో నివసించే చెంచులు వంటి వెనుకబడిన ఆదివాసీలకు ఎంతో ఉపయోగపడిందన్నారు.

ఈ విధానాన్ని రద్దు చేసిన తర్వాత, ఏజెన్సీ ప్రాంతాలేకాక దానిని ఆనుకుని ఉన్న గ్రామాల నుండి కూడా తీవ్ర అసంతప్తిని వెళ్ళబోస్తూ వార్తలు వెలుగులోకి వచ్చాయన్నారు. పలు గ్రామాల్లో ఆదివాసీలు అటవీ మార్గాల మధ్యగా 10 కిలోమీటర్ల వరకు నడవాల్సి వస్తోందని, లిబ్రిక్ ఇండియా అనే విధాన పరిశోధనా సంస్థ, పాడేరు ఐటిడిఎ పరిధిలో 790 మంది ఆదివాసీ లబ్దిదారులతో నిర్వహించిన సర్వే ప్రకారం, 83 శాతం మంది ఇంటివద్ద పంపిణీ వ్యవస్థను డిపో వ్యవస్థకంటే మెరుగైనదిగా అభిప్రాయపడ్డారన్నారు.

92 శాతం మంది ప్రయాణ భారం తగ్గిందని పేర్కొన్నారని, డిపోల వద్ద 75 శాతం మంది రేషన్ తక్కువగా ఇచ్చారని, 65 శాతం మంది అదనపు వస్తువులు కొనాలని ఒత్తిడి ఎదుర్కొన్నారని వెల్లడించారు. స్పష్టంగా, దూరప్రాంతాల్లో నివసించే ఆదివాసీ కుటుంబాలకు ఇంటివద్ద రేషన్ పంపిణీ వ్యవస్థ మెరుగైనదని, దూరాభారాల సమస్య తగ్గించిందని ఈ సర్వేలో తేలిందని తెలిపారు. ఇంటి వద్ద పంపిణీ ప్రాథమిక మార్గంగా ఉంచుతూ, డిపోలను బ్యాకప్ ఛానల్‌గా కొనసాగించే ద్వంద్వ విధానాన్ని అమలు చేయడం ఉపయోగకరమని వారు అభిప్రాయపడ్డారు. ఆదివాసీ ప్రాంతాల్లో, డిపోలు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి కాబట్టి, మరింత సులభంగా బాధ్యతాయుతంగా నడిపే అవకాశం ప్రభుత్వం ఉంటుందన్నారు. మొబైల్ యూనిట్ల వల్ల ఏర్పడిన పారదర్శకత, జవాబుదారీ తనం వల్ల ఇబ్బంది పడుతున్న రేషన్‌డిపో డీలర్ల శక్తివంతమైన లాబీ ఈ వ్యవస్థ రద్దు వెనక ఉండవచ్చని తాము భావిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ ప్రాంతాలన్నింటిలోనూ తక్షణమే ఇంటి వద్ద రేషన్ పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : వైసిపి



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

విశాఖ కలెక్టరేట్ : ఎస్ఎస్.ఫార్మా ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్మికుల కుటుంబాలను, అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. గురువారం కెజిహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కంపెనీల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా ? లేదా ? అన్నది ప్రభుత్వం గమనించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

25న డివిజన్ లెవల్ డాక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం డివిజన్ 12 వ డివిజనల్ స్థాయి డాక్అదాలత్ ఈ నెల 25 న మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని, విశాఖపట్నం డివిజన్ సీనియర్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మేన ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఎవిఎన్ కాలేజ్ డౌన్, వేలంపేట ఉన్న తమ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ప్రజల నుండి పోస్టల్ సేవలకు సంబంధించిన నిర్దిష్ట, వ్యక్తిగత, అలాగే వ్యక్తిగత ఫిర్యాదులను అదాలత్ వింటుందన్నారు. అలాగే విశాఖపట్నం పోస్టల్ డివిజన్‌కు సంబంధించిన పోస్టల్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను గజేంద్రకుమార్ మీనా, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్,విశాఖపట్నం డివిజన్, విశాఖపట్నం-530001 కు ఈ నెల తద్వారా 23,లేదా అంతకు ముందు చేరుకోవచ్చని, ఆ తర్వాత వచ్చే ఫిర్యాదులను స్వీకరించటం జరగదు అన్నారు. లేఖలు, ఎన్వలప్‌లపై 12వ డివిజనల్ స్థాయి డాక్అదాలత్ అని రాయాలన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతిఒక్కరూ సేవాభావంతో మెలగాలని 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. గురువారం 30వ వార్డు జాలారిపేట ప్రాంతానికి చెందిన విభిన్నప్రతిభావంతురాలు ఆదమ్మకు వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్నారు. ఈ క్రమంలో తాను 4 దశాబ్దాల నుంచి తన సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా, ఒక ప్రజాప్రతినిధిగా సహాయం అడిగిన ప్రతి ఒక్కరికి కాదనకుండా, లేదనుకుండా తన పరిధి మేరకు అందరికీ సహాయం చేస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలలో రాజకీయాలకు చోటు లేదన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌లో చట్టవిరుద్ధంగా తొలగించిన 4,500మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాని ఉద్దేశించి ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ ప్రసంగిస్తూ, దేశవ్యాప్తంగా విశాఖస్టీల్ పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అశేష త్యాగాలతో నిర్మితమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రభుత్వంగా పరిశ్రమగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అయితే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేసి, కేంద్ర ప్రభుత్వం లక్షలకోట్ల ప్రజాధనాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. 40 ఏళ్లుగా విశాఖస్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించకుండా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నేడు నష్టాలు చవిచూస్తోందని తెలిపారు. ముడిసరుకు టన్నురూ.600 కి రావలసింది రూ.6 వేలకి నేడు కొనాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని రక్షించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకై, రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. స్టీల్ ప్లాంట్ కు ఉన్న భూములను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ఉపాధ్యక్షులు ఎస్.కె. రెహమాన్, కె.సత్యనారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బూసి వెంకటరావు, కార్యదర్శులు పి.చంద్రశేఖర్, పడాల గోవిందు, నాగభూషణం, సిహెచ్.కాసుబాబు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎఐటియుసి నాయకులు

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -సబ్బవరం : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు జన్మదిన వేడుకల్లో భాగంగా సబ్బవరం మండలం జనసేన సీనియర్ నాయకురాలు బంతి కోళ్ల పద్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు పేరున పెందుర్తి మణిప్రకాష్ వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిచారు. మండల పార్టీ అధ్యక్షుడు కర్రి కనకరాజు ప్రారంభించిన కార్యక్రమంలో బంతికోళ్ల పద్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆయురారోగ్యంతో ఉండాలని, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మండలంలో తమ టీం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామ న్నారు. కార్యక్రమంలో తాటిపాముల శేఖరు ,కొల్లి కష్ణ, పల్లి మంగరాజు ,జెట్టి ప్రసాద్, రాజు (పాస్టర్) ,మన్మధరావు, కొండలరావు ,సత్తిరాజు, శ్రీను, నీటి పల్లి దేముడు (కొండబాబు) పాల్గొన్నారు.

బదిలీ తహశీల్దార్లు విధుల్లో చేరాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నం, అల్లూరు సీతారామరాజు జిల్లాల నుంచి అనకాపల్లి జిల్లాకు ఐదుగురు తహశీల్దార్లు బదిలీపై వచ్చిన తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు అల్లూరి జిల్లా నుంచి ఎంబి అప్పారావు, బి నాగరాజు, సిహెచ్ తిరుమలరావు అనకాపల్లి జిల్లా అనకాపల్లి, పరవాడ, కసింకోట మండలాలకు, అలాగే విశాఖపట్నం నుంచి ఎం ఆనంద్‌కుమార్, ఎం భుజంగరావు అనకాపల్లి జిల్లా మునగపాక, కే కోటపాడుకు బదిలీ అయ్యారు. అనకాపల్లి తహశీల్దార్ విజయ్ కుమార్‌ను అనకాపల్లి కలెక్టర్ కార్యాలయ పరిపాలన సెక్షన్ సూపరింటెండెంట్‌గా, మునగపాక తహశీల్దార్ మహేశ్వరరావును పాయకరావు పేట, పాయకరావుపేట తహశీల్దార్ జి. సత్యనారాయణను అచ్యుతాపురం, రావికమతం తహశీల్దార్ బి వెంకటరమణను మాకవరపాలెం, పరవాడ తహశీల్దార్ ఎస్‌వి అంబేద్కర్‌ను రావికమతం బదిలీ చేశారు. అలాగే అనకాపల్లి డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సుధాకర్‌ను నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా, కసింకోట తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావును అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన మండలాల తహశీల్దారులు యధావిధిగా కొనసాగుతారు.

ఎన్నాళ్లిలా..?

- కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై మోకాళ్ళ లోతు నీరు
- బుచ్చయ్యపేట పాత పోలీసుస్టేషన్ వద్ద పరిస్థితి
- రాకపోకలకు వాహనదారులు, ప్రజల ఇక్కట్లు



గురువారం కురిసిన వర్షానికి రోడ్డుపై చేరిన నీరు

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట : చిన్నపాటి వర్షానికే కశింకోట-బంగారు మెట్ట రోడ్డులో మండల కేంద్రంలో పాత పోలీస్ స్టేషన్ రోడ్డు అధ్వానస్థితికి చేరుకుంది. రోడ్డు విస్తరణలో భాగంగా బుచ్చయ్యపేట జంక్షన్ నుండి విశ్వబ్రాహ్మణల ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మించారు.అయితే సిసి రోడ్డు నిర్మించిన ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా నివాసితులు తమ ఇళ్ల ముందు స్థలాలను ఎత్తుగా చేసుకున్నారు. దీంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక నిలిచిపోతుంది.కొద్దిపాటి వర్షం కురిసిన భారీగా నీరు చేరిపోతుంది. నిత్యం ఈ రోడ్డు గుండా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వర్షపునీరులో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు స్పందించి,నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు

దాహార్తి తీర్చాలని ఆందోళన

- పాడైన మోటారుతో తాగునీటికి ఇక్కట్లు
- మొరపెట్టుకున్నా పట్టని అధికారులు



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి -రాంబిల్లి : రక్షితమంచినీటి పథకం మోటారు పాడవ్వడంతో నాలుగురోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని గజిరెడ్డిపాలెం గ్రామ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం నీటి పథకం వద్ద ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, నీటి పథకం మోటారు పాడై, నీరు సరఫరా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై అధికారులకు నేతలకు విన్నవించినా స్పందన లేదన్నారు. తమ గ్రామంలో నీటి పథకాన్ని బాగుచేయించి, తాగునీటి కష్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయాలనికి వెళ్లి ఎఒకు వినతిపత్రం సమర్పించినట్లు ఎరిపెల్లి రాము, మహిళలు తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలను అందజేస్తున్న శ్రీరామ్మూర్తి, రమణ

ప్రజాశక్తి-సబ్బవరం: విద్యార్థులు మంచి లక్ష్యాలను ఏర్పచుకొని పట్టుదలతో కృషిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు బొబ్బిలి శ్రీరామమూర్తి అన్నారు. గురువారం స్థానిక ప్రతిభా విద్యాలయంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటుపాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు వారి ఉన్నత విద్యకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం గర్వకారణమని, ప్రతిభ విద్యాలయ యాజమాన్యం ప్రత్యేకమని ప్రశంసించారు. ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన అధ్యాపక సిబ్బందిని అభినందించారు. తమ పాఠశాలలో టాపర్స్‌కు ఏటా మాదిరిగానే నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఈఏడాది టెన్త్ ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన వంక గ్రీశ్మంత చరణ్‌కు రూ.లక్ష ప్రైజ్ మనీ చెక్కు అందజేశారు. అలాగే మండలంలో ద్వితీయ స్థానంలో సాధించిన జి యజ్ఞశ్రీ, జి గీతికలకు చెరో రూ. 50 వేలు, 580 మార్కులు పైబడిన 12 మంది విద్యార్థులకు రూ.3000 చొప్పున, 550 మార్కులు పైబడిన 31 మందికి రూ.వెయ్యి చొప్పున ఆర్థికప్రోత్సాహకాలను అందజేశారు. ఎపి పాలిసెట్‌లో రాష్ట్రంలో 171 ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.3000, ఎంఎస్ఎంఇలో 18వ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ. 3000 చొప్పున ప్రైజ్ మనీ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్స్‌గా మెరిసిన ముగ్గురు విద్యార్థులకు రూ.20వేలు నగదు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అన్సీ జోసెఫ్, పాఠశాల డైరెక్టర్ ఆదిరెడ్డి శరత్ తేజ, ప్రధానోపాధ్యాయురాలు కనకమహలక్ష్మి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



డిఇఒ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : నిబంధనలను అతిక్రమించి విద్యా వ్యాపారం చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాలయాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ జి. పార్వతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అక్రమ ఫీజులు వసూలుతోపాటు, విద్యాహక్కు చట్టం ఉల్లంఘిస్తూ అధిక ధరలకు పుస్తకాలు యూనిఫామ్, ఇతర సామగ్రిని అమ్ముతూ విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలకు ఉపక్రమించకుంటే, విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె. మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే బువ్వెలా వస్తుంది?

- 13 వారాలుగా అందని రూ.410కోట్ల ఉపాధి బకాయిలు
- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉపాధి హామీ పథక వేతనదారులకు 13 వారాలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని, రూ.410 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న విమర్శించారు. గురువారం దేవరాపల్లిలో మాట్లాడుతూ, ఈ ఏడాది మార్చి 20వ తేదీ నుంచి ఇప్పటివరకు కూలీలకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితి చట్టం వచ్చిన తరువాత ఎప్పుడు లేదన్నారు.

ఉపాధి పథకానికి నిధులు కేటాయించకుండా, కూలీలకు బిల్లులు చెల్లించకుండా నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. ఆ క్రమంలోనే ఇప్పటివరకు రాష్ట్రాల అజమాయిషీలో ఉన్న ఈ పథకాన్ని ఇకపై పూర్తిగా కేంద్రం చేతికి వెళ్లనున్నదని ఆరోపించారు. పనిచేసిన కూలీలకు వారాల తరబడి బిల్లులు చెల్లించకుంటే కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు 100 రోజుల ఉపాధికి గ్యారెంటీ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ యాప్ ద్వారా కేంద్ర పర్యవేక్షణ మొదలైతే ఉపాధి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే రోడ్లు, మురుగు కాలువలు, ఇతర భవన నిర్మాణ పనులు భవిష్యత్తులో చేసే వీలుండదన్నారు. ఉపాధి పథకంలో పనిచేసే ఉద్యోగులు ఎవరి పర్యవేక్షణలో విధులు నిర్వహించాలో, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నా యన్నారు. అవినీతి నిర్మూలనకే ఈ యాప్ తెచ్చామని కేంద్రం గొప్పలు చెబుతున్నా, దీని ద్వారా రాష్ట్రాల అజమాయిషీ, హక్కులు కోల్పోక తప్పదని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా నిధుల కొరతను సృష్టించి, వాంఛితంగా ప్రజలే ఉపాధి పథకానికి దూరమయ్యేలా కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. యోగా పేరుతో ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వాలు, ఉపాధి బకాయిలు చెల్లింపుల్లో తాత్సారం చేయడం సరికాదన్నారు. వెంటనే ఉపాధి వేతన బకాయిలు చెల్లించకుంటే ఎక్కడికక్కడే ఆందోళనలు తీవ్రం చేయాలని శ్రామికులకు వెంకన్న పిలుపునిచ్చారు



చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పూడ్చేసిన కల్వర్టు పునరుద్ధరణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



కొత్తపైపు మదుము ఏర్పాటు చేస్తున్న జివిఎంసి యంత్రాంగం

ప్రజాశక్తి- దేవరాపల్లి : రైవాడ జలాశయం నుంచి విశాఖ నగరానికి మంచినీటి సరఫరా చేసే కాలువకు మరమ్మత్తుల పేరుతో 0.350 కిలోమీటరు వద్ద పూడ్చేసిన మదుమును జివిఎంసి అధికారులు పునరుద్ధరించారు. పాడైన ఈ తూమును పునరుద్ధరించాల్సిన అధికారులు పూడ్చేయడంతో పొలాల్లో చేరిన అదనపు నీరు వెళ్లే దారి లేక కాలువ ఎడమ గట్టు వైపు పొలాలు మునిగిపోయి పంట నష్టపోయే పరిస్థితి ఉండడంతో రైతుల ఆందోళనపై ఈనెల 7న ప్రజాశక్తిలో 'మూసేసిన కల్వర్టుతో ముంపు ముప్పు' శీర్షికతో వెలుగులోకి తేగా, జివిఎంసి అధికారులు స్పందించారు. పాడై, కప్పేసిన పాత సిమెంట్ పైపు స్థానంలో కొత్త తూమును ఏర్పాటు చేశారు. తద్వారా ఎడమవైపు పొలాల్లో చేరిన అదనపు నీరు యథావిధిగా పోయేలా మార్గాన్ని పునరుద్ధరించామని జివిఎంసి ఎఇఇ మోహన్, సూపర్వైజరు పోలినాయుడు తెలిపారు. కాగా తమ సమస్యకు పరిష్కారం చేయడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. వందలాది ఎకరాల పంటకు ముంపు సమస్య తొలగిందని రైతులు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే కప్ ఉత్తరాంధ్ర కిక్ బాక్సింగ్ టోర్నీ

ప్రజాశక్తి.- సబ్బవరం : ఈనెల 13న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్యే కప్ ఉత్తరాంధ్ర కిక్ బాక్సింగ్ టోర్నమెంటును మండల కేంద్రంలోనిప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షులు కర్రి కనకరాజు తెలిపారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో మండల జనసేన నాయకుల ప్రోత్సాహంతో నిర్వహించే ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామనానరు. జనసేన పార్టీ, కూటమి నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

విశాఖ డెయిరీ పాలసంఘ కార్యదర్శుల ఆందోళన



మానవహారంగా పాలసంఘం కార్యదర్శులు, హెల్పర్లు

ప్రజాశక్తి -చోడవరం : విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రాల్లో నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్యదర్శులు, హెల్పర్లకు కనీస వేతనం చట్టం అమలు చేయాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గురువారం గాంధీ నగరం పాలకేంద్రం నుంచి ర్యాలీగా వచ్చి కొత్తూరు జంక్షన్‌లో మానవ హారం నిర్మించారు. సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో చోడవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, పాల కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యదర్శులు హెల్పర్లకు కనీస వేతనాలు, ఇఎస్ఐ, గ్యాట్యుటీ, ఇతర సౌకర్యాలను కల్పించకుండా యాజమాన్యం శ్రమదోపిడి చేస్తోందన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగుపాము కనకరావు, దాడి రామారావు, బొడ్డెడ ప్రసాద్, 200 మంది వేతన కార్యదర్శులు, హెల్పర్లు పాల్గొన్నారు.

కుళాయిల్లో కలుషిత నీరు



ట్యాప్‌కు గుడ్డ కట్టి బిందెల్లో నీరు పడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - కశింకోట : మేజర్ పంచాయతీ కశింకోట పూసర్ల వీధి, వినాయక గుడి వీధిలో మంచినీటి కుళాయి ద్వారా 15 రోజులుగా కలుషిత నీరు వస్తోందని స్థానిక మహిళలు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ నీటిలో నలకలు వస్తున్నాయని అంటున్నారు. దీనిపై పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా వీధుల్లోని మహిళలు ఆరోపిస్తున్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కుళాయి ట్యాప్‌లకు గుడ్డలను కట్టి బిందెలతో నీటిని పట్టుకోవాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీగానీ, సంబంధిత అధికారులుగానీ స్పందించి, కుళాయిల ద్వారా కాలుష్యరహిత శుద్ధనీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, ఎంఇఒ

ప్రజాశక్తి-మునగపాక: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి లక్ష్యం కావాలని, దీనికి స్వచ్ఛందసంస్థలు, ప్రజలు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ముందుకు రావాలని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు, ఎంఇఒ బుద్ధ శివనాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రం మునగపాకలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముందుగా 'బాలలకు పనిచేసే వాతావరణాన్ని కాదు- చదువుకునే వాతావరణాన్ని సృష్టిద్దాం' అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బాల కార్మికులు లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం ఉచిత నిర్బంధహక్కు చట్టంతోపాటు బాల కార్మిక నిర్మూలనచట్టాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మళ్ల నాగేశ్వర రావు, జనసేన మండలాధ్యక్షులు టెక్కలి పరశురాం, ప్రణతి స్కూల్ ప్రిన్సిపల్ ఆడారి సతీష్, సిఆర్‌పి గోవిందు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) అన్నారు. గురువారం తుమ్మపాల అంగన్వాడీ కేంద్రం-5లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లిదండ్రులతో కలిసి పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద సత్యనారాయణ మండలంలోని అంగన్వాడీలు పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు.ఈ సందర్భంగా పిల్లలకు తన సొంత నిధులతో పలకలను అందజేశారు.



విద్యార్థులకు పలకలు పంచుతున్న మండల టిడిపి అధ్యక్షులు కర్రి బాబి

కశింకోట : స్థానిక సత్తెమ్మ కాలనీ అంగన్వాడీ కేంద్రం వద్ద చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.విశ్రాంత ఉద్యోగి సంబా రమణ అంగన్వాడీ కార్యకర్త తనూజ, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. సుందరయ్యపేట అంగన్వాడీలో కార్యకర్త కృష్ణవేణి, బంగారయ్యపేట రామాలయం వద్ద కూటమి నాయకులు ఉల్లింగల రమేష్, కర్రి సత్యనారాయణ, కర్రి గోవింద, అంగన్వాడీ కార్యకర్తలు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి.

నక్కపల్లి:మండలంలో అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. నక్కపల్లి వీవర్స్ కాలనీలో గణపతి ఆలయం, వేంపాడు, పెదతీనార్ల, చిన తీనార్ల దొండవాక, తదితర గ్రామాల్లో అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పిల్లలకు పలకా, బలపం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు జయ రత్న కుమారి, సూరకత్నం, పెద్ద తీనార్ల ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వీసం రాజు, అయినంపూడి మణిరాజు, అప్పలరాజు, ఐసిడిఎస్ పిఓ శ్రీవిద్య, సూపర్వైజర్ లలిత, సత్యవతి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా కూటమి ఏడాది పాలన సంబరాలు



కేకు కట్ చేస్తున్న జివిఎంసి మేయర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం : గోపాలపట్నంలోని పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ విప్ గణబాబు తనయుడు మౌర్య సింహ ఆధ్వర్యాన ఏడాది పాలన సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభి షేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించు కున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, కూటమి నాయకులు బాలసుబ్రహ్మణ్యం, నరిపిన్ని సత్తిరాజు, నందవరపు సోములు పాల్గొన్నారు.



గాజువాకలో ఏడాది పాలన బ్రోచర్ ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మూడు పార్టీల శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచుకున్నారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కూటమి ప్రభుత్వ ఏడాది సంబరాల్లో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు. తన ఛాంబర్‌లో బిజెపి, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన ఫ్లోర్ లీడర్ బీశెట్టి వసంతలక్ష్మి, బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాసరావు, పి.జ్యోతిష్‌కుమార్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక కూటమి నేతలు భారీ కేకును కట్ చేశారు. అనంతరం ఏడాది పాలనపై ముద్రించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొండా జగన్, రాజాన రామారావు, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు కార్యాలయంలో మద్దిల రాజశేఖర్ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గాడు అప్పలనాయుడు, దొంతల రమణ, బండి రాజా రమేష్, మద్దిల రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి వాంబే కాలని అన్నా క్యాంటిన్ దగ్గర టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు కేకు కట్‌చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానూరి అచ్యుత్, నొడగల భవాని, అప్పారావు, నాగోతి శివాజీ, నాగోతి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : 'సుపరిపాలనకు ఏడాది' పేరుతో స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, నాయకులు స్వామి, డిఎవిఎన్.రాజు, గంటా నూకరాజు పాల్గొన్నారు

ఆనందపురం : ఆనందపురం పూల మార్కెట్ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహానికి కూటమి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గండ్రేటి సోంబాబు, తాత్రాజు అప్పారావు, బిఆర్‌బి.నాయుడు, వానపల్లి ముత్యాలరావు, తమ్మిన అప్పలరాజు పాల్గొన్నారు.

కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి బొట్టవానిపాలెంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు, బోయి వెంకటరమణ, నాగోతి సత్యనారాయణ, దేవర శివ పాల్గొన్నారు.

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి శ్రేణులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. నక్కపల్లిలో కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పార్టీ నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, దేవర సత్యనారాయణ, కొప్పిశెట్టి బుజ్జి, సూర్యనారాయణ రాజు, మీగడ సత్తిబాబు, వైబోయిన రమణ, దార్ల కృష్ణ, కొప్పిశెట్టి శ్రీను, పుణ్యమంతుల బాబ్జి, అప్పలరాజు, కోసూరి శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.

సబ్బవరం.: రాష్ట్రంలో కూటమి పాలన తొలి వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మండల టిడిపి అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి పాల్గొని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి, పరస్పరం తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. టిడిపి యువనేత గండి వంశీ దీప్, భరణికాన సాయినాథరావు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, కోటాన అప్పారావు, బొండా సత్యారావు, గండి దేముడు, గవర అప్పారావు, కోరాడ శ్రీనివాసరావు, కరణం రామునాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో కూటమి శ్రేణులు సంబరాల్లో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు కేకు కట్‌చేసి కూటమి శ్రేణులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజును సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపిపి దాకవరపు నాగేశ్వరదేవి, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, సర్పంచ్ సుంకర లక్ష్మి, దొంకిన అప్పలనాయుడు, జనసేన నేత సిరిపురపు రమేష్, మాజీ జెడ్‌పిటిసి వియ్యపు అప్పారావు, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు దేవర అప్పారావు తమరాన దాసు, సాయం శేషు, కోరుకొండ రవికుమార్, కోట సత్యనారాయణ పాల్గొన్నారు

దేవరాపల్లి : రాష్ట్రంలో కూటమి పాలనలో ఏడాది పూర్తయిన సందర్భంగా రైవాడ అతిథి గృహం వద్ద మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, భారీ కేక్ కట్ చేశారు. అభిమానులకు స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సబ్బవరపు పెంటమ్మ దొగ్గ దేముడు నాయుడు, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, శరఖాన సూర్యనారాయణ, చల్లా నానాజీ, చల్లా తాతయ్యలు, పూడి సత్యారావు, రెడ్డి అశోక్, సోమిరెడ్డి గోవింద, రెడ్డి బలరాం పాల్గొన్నారు.


పాయకరావుపేట: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా గురువారం పాయకరావుపేటలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

రోలుగుంట: ఏడాది కూటమి పాలన సుపరిపాలనగా సాగిందని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. గురువారం రోలుగుంట మండల పరిషత్ కార్యాలయంలో కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎంపిడిఒ నాగేశ్వరరావు, తహశీల్దార్ నాగమ్మ, టీడీపీ నాయకులు చంద్రమౌళి, ఎంపిటిసి రామకృష్ణ పాల్గొన్నారు.

మాడుగుల : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏడాది పాలన సాగిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. మండల కేంద్రంలోని దేవి ఆడిటోరియంలో కూటమి నేతలు ఆధ్వర్యంలో ఈ ఏడాది పాలన సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి ఉండూరు దేముడు, సీనియర్ నాయకులు సందారావు సన్యాసిరావు, మజ్జి లక్ష్మణరావు, పుప్పాల రమేష్, సుంకరి సింహాచలం నాయుడు, సిహెచ్ చక్రవర్తి, అప్పాన వెంకటరమణ పాల్గొన్నారు.



సబ్బవరంలో కేకు కట్ చేస్తున్నగండి బాబ్జి



రోలుగుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు



దేవరాపల్లిలో కేకు కట్ చేస్తున్న కూటమి శ్రేణులు

తొలకరి వర్షాలతో రైతులకు మేలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : వేసవి చివరిలోనూ, ముందస్తు తొలకరిలో తరచూ కురుస్తున్న వర్షాలు రైతులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతులు తమ భూములను ట్రాక్టర్లతో దున్నించి చదును చేసి యూకలిప్టస్, సరుగుడు, అకేసియా వంటి మొక్కలను నాటుతున్నారు. మండలంలోని ఆర్లి చంద్రయ్యపేట సూదివలస, మర్రివలస, శృంగవరం పిండ్రంగి, గుల్లిపల్లి తదితర గ్రామాలలోని మెట్ట రైతులకు ఈ వర్షాలు ఎంతో మేలు చేకూర్చాయి. సరుగుడు, యూకలిప్టస్‌తోపాటు కొందరు మామిడి, జీడి వంటి పండ్ల మొక్కలను నాటుకున్నారు. మరికొందరు ఖరీఫ్ వరినారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. తొలకరి వర్షాలతో ప్రస్తుతానికి రైతులు ఖుషీగా ఉన్నారు.



మెట్టు పాలాల్లో నాటిన యూకలిప్టస్ మొక్కలు

పని గంటల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి- కె. కోటపాడు : కార్మికుల పనిగంటలను పెంచాలన్న రాష్ట్ర కేబినెట్ నిర్ణయాన్ని వెంటనే వెంటనే విరమించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వి.సంతపాలెంలో ఆనందపురం శాఖ సమావేశంలో మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి పూర్వ కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటలు పనిదినం హక్కును 12గంటలకు పెంచి శ్రమదోపిడికి నిర్ణయించడం దుర్మార్గమన్నారు.

కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ, దేశసంపదను వారికి కట్టబెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు నిరసనగా వచ్చేనెల 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నాయుడుబాబు పాల్గొన్నారు.


15న యోగాంధ్ర మెగా బైక్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న యోగా గురువులు

ప్రజాశక్తి- అనకాపల్లి : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో ఐదు వేలమందితో మెగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షులు, యోగా గురువు భీశెట్టి దొరమ్మ నాయుడు, పతంజలి భారత స్వాభిమాన రామచంద్ర మెడిటేషన్ ట్రైనర్ మంగయ్య వెల్లడించారు. గురువారం స్థానిక జార్జి క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, పతంజలి యోగా, శ్రీ రామచంద్ర మెడిటేషన్ సంయుక్తంగా నిర్వహించేకార్యక్రమంలో జిల్లాలోని22 మండలాల నుంచి యోగా సెంట్రల్ అభ్యాసకులు విద్యార్థులు పాల్గొంటారన్నారు. పట్టణంలో ఈనెల 15న ఉదయం 6 గంటలకు జార్జిక్లబ్ నుంచి ప్రారంభమై మెయిన్‌రోడ్డు, రింగ్ రోడ్డు, రైల్వే స్టేషన్ మీదుగా తిరిగి జార్జి క్లబ్‌కు బైక్‌ర్యాలీ చేరుతుందన్నారు. యోగాంధ్ర నిర్వహణలో రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు.ఈనెల 21న విశాఖలో ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు పాల్గొనే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యోగ గురువులు వి సంతోష్ గోవర్ధని, టి మల్లేశ్వరరావు, ఎమ్మెన్నార్ అప్పారావు, దాడి బుజ్జి, పొలమర శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్స్‌కు బహుమతులు



వార్షిక శిక్షణలో బహుమతులతో ఎన్‌సిసి క్యాడెట్స్

ప్రజాశక్తి -సబ్బవరం : 13 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో స్థానిక దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న యువశక్తి వార్షిక శిక్షణా శిబిరంలో ఎన్‌సిసి క్యాడెట్స్‌ను ఆల్ఫా, బ్రావో, చార్లీ, డెల్టా ఈకో, ఫాక్స్ ట్రాట్ కంపెనీలుగా విడగొట్టి వ్యాసరచన, డిబేట్, క్విజ్, పోస్టర్ మేకింగ్,వాలీబాల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు.విజేతలకు క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్స్ చదువుతో పాటు వివిధ ఆటలు ఆడటం ద్వారా మానసిక స్థైర్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. చదువుతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కోరారు.కార్యక్రమంలో సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్‌సిసి అధికారులు, 468 మంది ఎన్‌సిసి క్యాడెట్స్, పిఐ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షురాలు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు ఎం. దుర్గా రాణి పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాల యంలో సమావేశం సిహెచ్. మహాలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎం.దుర్గారాణి మాట్లాడుతూ, అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం చేసిన ఒప్పందాలు అమలు చేయాలన్నారు. వేతనాల పెంపు, మినీ టీచర్ల ప్రమోషన్స్, పెన్షన్లు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఐసిడిఎస్‌లకు తగిన నిధులు కేటాయింపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.రమణమ్మ, సిహెచ్. భ్రమరాంబ, మంగ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణవేణి, సామ్రాజ్యం, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.


నక్కపల్లిలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి వెంకట నగర్ కాలనీలో శ్రీ సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పండు శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంతంలో భారీ అన్న సమారాధన చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.సామాజిక కార్యకర్త నవర సూకరాజు శర్మను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

గ్రామాల్లో పండుగల సందడి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో గురువారం అప్పికొండమ్మ అమ్మవారి పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భారీ ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

పరవాడ: పరవాడ గ్రామదేవత, పైలా కుటుంబీకుల ఇలవేల్పు దుర్గమాంబ పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని వైసిపి సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, ఆలయ ధర్మకర్త పైల పెద్దింటి పోతునాయుడు, పైలా రాధాకృష్ణ, వర్రి హరి, లాలం సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- హుకుంపేట:ఉప్ప ఆరోగ్య కేంద్రం పరిధిలోని పట్టం పంచాయతీ గ్రామాలలో ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా ప్రతాప్ మాట్లాడుతూ, "60 సంవత్సరాల పైబడి ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, ధూమపానం ఉన్న వారు క్షయ వ్యాధి బారినపడే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గిన వారు తప్పక ఆరోగ్య కేంద్రంలో కఫ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న శ్రీధర్

ప్రజాశక్తి -కోటవురట్ల:మేలైన యాజమాన్యంతోనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని జాతీయ మత్స్య పరిశోధన సంస్థ శాస్త్రవేత్త యు శ్రీధర్ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కొడవటిపూడి, పి.జగ్గంపేట గ్రామాలలో మండల వ్యవసాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేలైన విత్తనాలు ఎంపిక చేసుకొని సరైన సాగు పద్ధతి అవలంబించి అధిక దిగుబడులు సాధించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారిని సరోజినీ మాట్లాడుతూ, మందుల పిచికారికి డ్రోన్ పద్ధతిని అవలంబించాలని కోరారు. నాట్లలో యంత్రాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధుసూదన్ రావు, ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు ప్రకాశరావు పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి:అక్రమంగా గ్రావెల్ ను ట్రాక్టర్ తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. మండలంలోని అమలాపురం నుండి వేంపాడు వైపు గురువారం అక్రమంగా ట్రాక్టర్ పై గ్రావిల్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసిల్దార్‌కు కేసును అప్పగించడం జరిగిందని సిఐ వెల్లడించారు.


సీజ్ చేసిన ట్రాక్టర్


తహశీల్దార్ వెంకటరమణ

తహశీల్దార్‌గా వెంకటరమణ

ప్రజాశక్తి -కోటవరట్ల: మాకవరపాలెం మండల తహసిల్దారుగా గురువారం వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. రావికమతం తహసిల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా మాకవరపాలెం బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ నర్సీపట్నం తహసిల్దార్ రామారావు ఇంచార్జ్ గా వ్యవహరించారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో స్థానిక కాఫీ హౌస్ లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని డీఆర్‌ఓ పద్మలత ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా సందర్శించి రక్తదాతలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పశు సంవర్ధక శాఖ అధికారులు నరసింహులు, షేక్ ఎండి షరీఫ్ చొరవతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కార్యదర్శి జి గౌరీ శంకర్, కోశాధికారి పి సూర్యారావు, సభ్యులు టి.ప్రసాద్ నాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:రెవెన్యూ సిబ్బంది గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. గురువారం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి తీరువా వసూళ్ల పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. రైతులతో మమేకమై వసూళ్లపై దృష్టి సారించాలని తెలిపారు. వరహానది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా, మట్టి అక్రమ రవాణా పట్ల నిర్లక్ష్యం చేయకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు ఈ కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ వర్ధవరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ ఇసుక స్వాధీనం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కైలాసపట్నం గ్రామం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నేపథ్యంలో తహసిల్దార్ తిరుమలబాబు బుధవారం రాత్రి సమయంలో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కైలాసపట్నం శివారున గ్యాస్ గోదాము సమీపంలో నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకొని తహసిల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.

బావిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యేకి వినతి

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట : బుచ్చయ్యపేట శివారు నేతావానిపాలెం గ్రామంలో గత రెండేళ్ల క్రితం వైసిపి నాయకుడు కప్పివేసిన లచ్చన్న బావిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుకు వినతి పత్రం అందజేశారు. గత రెండేళ్ల క్రితం గ్రామస్తులు వినియోగించే నీటి భావిని అక్రమంగా కప్పించి స్థలాన్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. బావి ని పునరుద్ధరించి వినియోగం లోనికి తీసుకువచ్చే విధం గా చర్యలు తీసుకోవాలిని కోరుతూ సర్పంచ్ సుంకర లక్ష్మి, మాజీ సర్పంచ్ దొంకిన అప్పలనాయుడు, వార్డు సభ్యులు వియ్యపు రామారావు, నాయుడు ఎమ్మెల్యేకు గురువారం బుచ్చయ్యపేటలో వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నర్సీపట్నంలో పుస్తకాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పాఠశాలలు పున్న ప్రారంభం రోజునే కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు చెట్టుపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా కూటమి నాయకులు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, చెట్టుపల్లి పిఎసిఎస్ చైర్మన్ అప్పికొండ రాజు, తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి మట్ట సతీష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పచ్చికారి ఈశ్వరరావు, వసంత నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కలిమి సత్తిబాబు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్ఎం ఎంఆర్వి.అప్పారావు, కూటమి నేతలు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, దాడి నాగరాజు, తాకాసి కృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ సత్యవతి పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఈ ఏడాది కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యింది. విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి, పాఠశాలల బాట పట్టారు. బ్యాగు భుజాన వేసి తరగతి గదిలో చేరారు. పిల్లలు పాఠశాలకు వచ్చే లోగా వారికి కావలసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు 50 శాతం వరకు ఇప్పటికే చేర్చారు. వాటిని ఈ నెల 20 నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంఇఒ-2 వి ఉషారాణి తెలిపారు. బూట్లు, సాక్సులు, బ్యాగులు ఇంకా రావలసి ఉందన్నారు. మండలంలోని 56 పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి చదువుతున్న వారు 2491 మంది విద్యార్థులున్నారన్నారు.

భీమునిపట్నం : జీవిఎంసి ఒకటో జోన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. జీవిఎంసి మూడో వార్డు పరిధిలోని పిఎస్ఎం హైస్కూల్‌లో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తిరుమలశ్రీదేవి, ఉపాధ్యాయులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, టిడిపి నాయకులు పిట్ట సురేష్, తాటిపూడి అప్పల రాజు, నరవ రామారావు, సత్తి బాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. సంతపేట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మిన సూరిబాబు, కొప్పల కృష్ణ, ఎస్ఎంసి చైర్మన్ డి వెంకటేష్, ఎం సుబ్బారావు పాల్గొన్నారు.


విద్యార్థులను ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలలు పునఃప్రారంభం

నక్కపల్లి:మండలంలో ప్రభుత్వ పాఠశాలలు పున్న ప్రారంభమయ్యాయి. సుమారుగా 50 రోజులు వేసవి సెలవులు అనంతరం గురువారం బడిగంట మోగడంతో పాఠశాలలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ,6095 మంది విద్యార్థులకు గాను, మొదటి రోజు 3,172 మంది పాఠశాలలకు హాజరైనట్లు తెలిపారు.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, నిఘం టువులు ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు అందజేయడం జరిగిందన్నారు. యూనిఫామ్, బ్యాగులు, షూలు వచ్చిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

ఇంటింటికీ కుళాయిల ద్వారా

తాగునీరు సరఫరా చేయాలి



ఖాళీ బిందెలతో ఆందోళన చేపడుతున్న మహిళలు

ప్రజాశక్తి-రావికమతం:రావికమతం మండలం టి.అజ్జాపురం గ్రామ పంచాయతీ పాత కొట్నాబెల్లి గ్రామంలో తాగునీటి సమస్యలపై గురువారం గిరిజన మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, తమ గ్రామానికి ఇటీవల జల్జీవన్ మిషన్ ద్వారా 16 లక్షల 90 వేలతో వాటర్ ట్యాంక్ మంజూరు అయ్యిందని తెలిపారు. ఇంటింటికి కొళాయి పైపు నిర్మాణం కూడా జరిగిందన్నారు. నేటికీ

గిరిజన మహిళల ఆందోళన

రెండు నెలలు గడుస్తున్నా ఇంటింటికి కొళాయి నీరు సరఫరా చేయలేదన్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగిన వాటర్ ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో క్లీనింగ్ చేయడానికి వీలుపడలేదన్నారు. ట్యాంక్ క్లీన్ చేయడానికి ట్యాంకు ఎక్కితే ఎక్కడ కింద పడుతుందోనన్న భయంతో ఎక్కడానికి సాహసించలేక పోతున్నారు. కొత్తగా మోటార్ అమర్చి తక్షణమే వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీటిని ఇంటింటికి సరఫరా చేయాలని గిరిజన మహిళలు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకుంటే లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించడం తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన నాయకులు పాడి బన్నయ్య, సింగారపు వలసయ్య, పలువురు ఆదివాసీ గిరిజన మహిళలు పలువురు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఓగా చంద్రశేఖరరావు

ప్రజాశక్తి -చీడికాడ:డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.చంద్రశేఖరరావు గురువారం కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పాయకరావుపేటలో విధులు నిర్వహించి చీడికాడ బదిలీ అయ్యారు. ఆయనను కార్యాలయ సిబ్బంది, జి కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి సత్కరించారు.



అభినందిస్తున్న సిబ్బంది

14 నుండి పాఠశాలల విద్యార్థులకు బస్ పాస్‌లు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం, పరిసర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 14 నుండి బస్సు పాసులు జారీ చేస్తామని డిపో మేనేజర్ ధీరజ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో బాలికలకు ఇంకా ఎటువంటి మార్గదర్శకాలు రాలేదని యధావిధి గానే బస్సు పాసులు .జారీ చేయడం జరుగుతుందన్నారు. సంవత్సర పాస్ చేసుకుంటే ఇబ్బందులు ఉండవని ఆయన తెలియజేశారు. నర్సీపట్నం నుండి అనకాపల్లి వరకు కూడా బస్సు పాసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.

బడి గంట మోగింది

- సందడి వాతావరణం నడుమ తెరుచుకున్న పాఠశాలలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బడి గంట మోగింది. వేసవి సెలవుల అనంతరం గురువారం ఉదయం పాఠశాలలు తెరుచుకున్నాయి. ఆటోలు, స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలపై తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు పాఠశాలలకు వెళ్తూ రోడ్లపై హడావిడిగా కనిపించారు. తొలిరోజు కావడంతో చాలా పాఠశాలల్లో విద్యార్థులు పలుచగా కనిపించారు. తరగతులకు హాజరైన వారికి విద్యా కిట్లును పలు పాఠశాలల్లో పంపిణీ చేశారు.



క్వీన్ మేరీ పాఠశాలకు వస్తున్న విద్యార్థినులు



తోటగరువు పాఠశాలలో విద్యా సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయిని





